క్లుప్తంగా

ఆర్థికంగా ఎదగాలి..

దెంకాడ: ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు అన్నారు. మండలంలోని పెదతాడివాడలో వైఎస్సార్ క్రాంతి పథం, డీఆర్‌డీఏ ద్వారా మంజూరైన పేపర్ ప్లేట్ల యూనిట్, జిరాక్స్ సెంటర్‌ను శనివారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు గాదిపల్లి రమేష్, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, ఏపీఎం విజయలక్ష్మి, పీఎస్ రెహనా, సీసీ సూరిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతపల్లి రామ్మూర్తి, గాదిపల్లి రామ్మూర్తి, చిరంజీవిరాజు పాల్గొన్నారు.

కరాటే పోటీలో నగర విద్యార్థుల ప్రతిభ



స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్ర స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ కరాటే పోటీల్లో నగరానికి చెందిన పలువురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఇటీవల పార్వతీపురం మన్యం జిల్లా వేదికగా జరిగిన అండర్–14, 17 బాల, బాలికల కరాటే పోటీల్లో విజయనగరంలోని శ్రీగురుదత్త పబ్లిక్ స్కూల్‌కు చెందిన ముగ్గురు క్రీడాకారులు పతకాలు సాధించారు. అండర్–14 విభాగంలో పి.హేమంత్ రజత పతకం దక్కించుకగా.. కె.శివగణేష్ కాంస్యం సాధించాడు. అదేవిధంగా అండర్–17 విభాగంలో ఎస్.శ్రీకాంత్ కాంస్య పతకం చేజిక్కించుకున్నాడు. ఈ మేరకు విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎ.పద్మ, ఉపాధ్యాయులు వీవీ జ్యోతి, కోచ్ కె.సంతోష్‌కుమార్ అభినందించారు.

యోగాలో రాణించిన తనిష్క

విజయనగరం: పట్టణానికి చెందిన విద్యార్థిని మజ్జి తనిష్క రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ పోటీలలో భాగంగా నిర్వహించిన యోగాలో మూడో స్థానంలో లభించింది. ఈమేరకు విద్యార్థినిని రెడ్‌క్రాస్ యోగా శిక్షణ కేంద్రం నిర్వాహకుడు ఆరి సుందరశివరావు శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనిష్క రెడ్‌క్రాస్ యోగా శిక్షణ కేంద్రంలో ఏడాదిగా శిక్షణ తీసుకుంటోందన్నారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లాకు పేరు తీసుకువచ్చిందని కొనియాడారు. కార్యక్రమంలో కేఆర్‌డీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ఏసు ప్రేమాలయం వార్షికోత్సవం

విజయనగరం టౌన్: నగరంలోని అంబటి సత్రం వద్దనున్న ఏసు ప్రేమాలయం వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. పాస్టర్ అలజంగి రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు కార్పొరేటర్ జి.నారాయణరావు, మండపేటకు చెందిన అపోస్తలిక్ గాడ్ వర్షిప్ మినిస్ట్రీ పాస్టర్ ఆర్.ప్రభుకుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా క్రీస్తు ఆరాధకులు పాడిన స్తుతిగీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సిస్టర్ సువర్ణ, కోరాడ నాగేశ్వరరావు, విక్టర్ బాబు, కిశోర్, శ్రీనివాస్, మేరీ రత్నం, యూత్ ఫర్ జీసెస్, వినిస్టన్ టీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఆవిష్కరణ

నెల్లిమర్ల: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వ్యాధుల సంఖ్య మూడు రెట్లు పెంచడం జరిగిందని ఆర్టీసీ రీజినల్ చైర్‌పర్సన్ గదల బంగారమ్మ అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ పథకం పేదలకు వరమని ఆమె అన్నారు. మండలంలోని కొండవెలగాడ ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆరోగ్యశ్రీ బ్రోచర్‌ను సిబ్బందితో కలిసి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శిరీష, సిబ్బంది పాల్గొన్నారు.

మురళీమోహన్ సేవలు అభినందనీయం



మురళీమోహన్‌ను సత్కరిస్తున్న డీపీఆర్‌ఓ రమేష్

విజయనగరం అర్బన్: జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేసిన బి.మురళీమోహన్ సేవలు అభినందనీయమని ఆ శాఖ జిల్లా అధికారి డి.రమేష్ కొనియాడారు. జిల్లాలో పబ్లిసిటీ అసిస్టెంట్‌గా పనిచేస్తూ ఆడియో విజన్ సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతి పొంది శ్రీకాకుళం జిల్లాకు బదిలీపై వెళ్తున్న మురళీమోహన్‌ను సహచర ఉద్యోగులు శనివారం సత్కరించారు. ఎస్.జానకమ్మ, మల్లేశ్వరరావు, మజ్జి వాసుదేవరావు, సత్యనారాయణ, పాల్గొన్నారు.

సమ్మెకు సహకరించాలి

నెల్లిమర్ల: అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెకు అన్ని వర్గాలూ సహకరించాలని సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నాయకులు కిల్లంపల్లి రామారావు, మొయిద పాపారావు, కాళ్ల అప్పలసూరి పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కార్మిక అమరవీరుల స్మారక భవనంలో అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

దెంకాడ: దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదనే ఉద్దేశంతోనే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జొన్నాడ పీఏసీఎస్ వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ వరి రకం 100 కేజీల బస్తాకు ప్రభుత్వం రూ.2,183, గ్రేడ్–ఎ రకానికి 2,203 రూపాయల కనీస మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు. గోనెలను ప్రభుత్వం అందజేస్తుందని.. లేనిపక్షంలో రైతులు సొంతంగా సమకూర్చుకుంటే ప్రభుత్వం ఆ డబ్బులను రైతులకు అందజేస్తుందని తెలిపారు. అలాగే ధాన్యం మిల్లులకు రవాణా చేసే వాహనాలకు జీపీఎస్ అమర్చుకోవాలని సూచించారు. రవాణా చార్జీలను వాహన యజమానికి ప్రభుత్వమే చెల్లిస్తుందని.. ఒకవేళ రైతు రవాణా చార్జీలు చెల్లిస్తే ఆ డబ్బులను కూడా రైతు బ్యాంక్ ఖాతాకు జమ చేస్తామన్నారు. కార్యక్రమంలో దెంకాడ పీఏసీఎస్ అధ్యక్షుడు రొంగలి కనకసింహాచలం, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, సర్పంచ్ పతివాడ గౌరి, సీఎస్‌డీటీ కొట్టాన శ్రీనివాసరావు, ఏఓ పూడి నిర్మల, ఏఈఓ రామకోటి, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, వైఎస్సార్‌సీపీ నాయకులు బమ్మిడి రమణ, రొంగలి గోపాలకృష్ణ, పీఏసీఎస్, వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

☛ చోడి విత్తనాలు అందజేత..

చిరుధాన్యాల ప్రోత్సాహ కార్యక్రమంలో భాగంగా రైతులకు చోడి విత్తనాలు అందజేశారు. దెంకాడ పీఏసీఎస్ వద్ద జరిగిన కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రొంగలి కనసింహాచలం, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్‌ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

• ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు



ఆర్బీకే భవనం శిలాఫలకం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

నెల్లిమర్ల: అన్నదాతలకు అండగా ప్రభుత్వం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని జోగిరాజుపేటలో ప్రభుత్వం నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం భవనాన్ని ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ, దేశంలోని ఏ రాష్ట్రంలో లేనివిధంగా అన్నదాతల సంక్షేమం కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాలను ప్రారంభించారన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు ఆర్‌బీకేల ద్వారా సరఫరా చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించి, ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం, డీసీసీబీ ఉపాధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు, సర్పంచ్ మత్స శ్రీదేవి, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

యువ ఓటర్లపై దృష్టి సారించండి

• కలెక్టర్ నాగలక్ష్మి



జొన్నాడలో ఓటు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి

దెంకాడ: యువ ఓటర్ల నమోదుపై బీఎల్‌ఓలు దృష్టి సారించాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. మండలంలోని జొన్నాడ పోలింగ్ కేంద్రంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓల రిజిస్టర్లు, క్లయిమ్‌ల దరఖాస్తులపై ఆరా తీశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పించాలన్నారు. డోర్ టు డోర్ సర్వేని అత్యంత పగడ్బందీగా నిర్వహించాలని సూచించారు. మరణించిన ఓటర్ల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి వారి పేర్లను తొలగించాలని ఆదేశించారు. ఎటువంటి తప్పుల్లేకుండా అత్యంత కచ్చితమైన ఓటర్ల జాబితాలను రూపొందించాలన్నారు. పరిశీలనలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, డీటీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలి

• జిల్లా హౌసింగ్ అధికారి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

నెల్లిమర్ల: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో జగనన్న గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా హౌసింగ్ అధికారి వి.శ్రీనివాసరావు సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జగనన్న హౌసింగ్ మెగా కంప్లీషన్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఇంతవరకు ప్రారంభం కాని జగనన్న గృహాలను ఈ నెలాఖరులోగా పూర్తి చేయించాలని సూచించారు. నిర్మాణాలు పూర్తి చేయకపోతే పట్టాలు రద్దు చేస్తామన్న విషయం, లబ్ధిదారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ జి.రామారావు, నగర పంచాయతీ కమిషనర్ పి.బాలాజీప్రసాద్, ఏఈ ఆర్.పవన్, వర్క్ ఇన్‌స్పెక్టర్ బి. మురళి, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వార్డు ఏమినిటీస్ కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రజలందరిపై అమ్మవారి ఆశీస్సులు

నెల్లిమర్ల: మాధవమ్మ పేరంటాలు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని విజయనగరం కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ నెల్లిమర్ల మండల అధ్యక్షుడు చనమల్లు వెంకటరమణ ఆకాంక్షించారు. గుషిణిలో శనివారం జరిగిన పేరంటాల గుడి ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయనతో పాటు ఆలయ నిర్మాణకర్తలు రెడ్డి లక్ష్మునాయుడు, భవానీ, రేగాన శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

సీతంలో కాలుష్య నియంత్రణ దినోత్సవం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కామేశ్వరరావు

విజయనగరం అర్బన్: పట్టణంలోని గాజులరేగ సీతం ఇంజినీరింగ్ కళాశాలలో జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా హాజరైన గాయత్రి విద్యాసంస్థల ప్రొఫెసర్ ఎ.కామేశ్వరరావు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణపై కళాశాల స్థాయి నుంచి విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రామమూర్తి, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి.రవికిషోర్, వివిధ విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

• నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి

విజయనగరం: నగర అభివృద్ధితో పాటు సంపూర్ణ మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా పనిచేస్తున్నామని మేయర్ విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక నగర పాలక సంస్థ సమావేశ మందిరంలో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అజెండాలో పొందుపరిచిన 46 అంశాలకు స్టాండింగ్ కమిటీ ఆమోదం తెలిపింది. ముందుగా పొందుపరిచిన అంశాలపై ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ చర్చించారు. అనంతరం మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, కౌన్సిల్ సభ్యుల సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఫ్లోర్ లీడర్ రాజేష్ మాట్లాడుతూ, నగరంలో ఎన్నడూ లేనంత అభివృద్ధి ప్రస్తుతండిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నేతృత్వంలో జరుగుతోందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పట్నా పైడిరాజు, పిన్నింటి కళావతి, బోనేల ధనలక్ష్మి, ఇన్‌చార్జ్ ఈఈ దక్షిణామూర్తి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా'ను విజయవంతం చేయండి

• ఎంపీపీ అప్పలనాయుడు



క్రీడా కిట్లను అందజేస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

విజయనగరం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ విజయవంతం చేయడానికి కృషి చేయాలని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 15 నుంచి గ్రామ సచివాలయ స్థాయిలో వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, క్రికెట్, తదితర పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి విజేతలు మండల స్థాయికి.. మండల స్థాయి విజేతలు జిల్లాకి.. జిల్లా స్థాయి విజేతలు రాష్ట్ర స్థాయిలో తలపడతారన్నారు. అనంతరం మండలానికి మంజూరైన క్రీడా కిట్లను పంచాయతీ కార్యదర్శులు, పీఈటీలకు అందజేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి, ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఏఈఓ సత్యవతి, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి అరుణకుమారి

విజయనగరం రూరల్: మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులు వేగవంతం కావాలని విజయనగరం మండల ప్రత్యేకాధికారి అరుణకుమారి అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల శాఖ అధికారులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగనన్న ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. బిల్లులు వెంటవెంటనే అప్‌లోడ్ చేసి లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీల రిజిస్ట్రేషన్లు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంటా వెంకటరావు, ఈఓపీఆర్‌డీ డి.తిరుపతినాయుడు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

భోగాపురం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన మార్పుల వల్ల ఆదివారం నుంచి బుధవారం వరకు సముద్రం అల్లకల్లోలంగా ఉంటుందని.. దీంతో సముద్ర తీర మత్స్యకారులు, రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ చింత బంగారు రాజు, మండల వ్యవసాయ శాఖాధికారి వి. హరి కృష్ణ తెలిపారు. ముక్కాం, కొండ్రాజుపాలెం, చేపల కంచేరు, భోగాపురం, ముంజేరు, తదితర గ్రామాల్లో శనివారం వారు పర్యటించి మత్స్యకారులు, రైతులకు తుఫాన్ ప్రభావంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉప తహసీల్దార్ ఎస్.శ్రీనివాసరావు, వీఆర్వో లక్ష్మి, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ నజీర్, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.



ముక్కాంలో మత్స్యకారులకు అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ బంగారురాజు

☛ వరి పంట సంరక్షణపై అవగాహన

నెల్లిమర్ల: వరి సాగు చేసే రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఓ ఎం. పూర్ణిమ సూచించారు. మండలంలోని సీతారాముని పేట, తంగుడుబిల్లి, జోగిరాజుపేట గ్రామాల్లో ఆమె పర్యటించి రైతులకు వరి పంట సంరక్షణపై అవగాహన కల్పించారు. వీలైనంతవరకు కోతలు వాయిదా వేసుకోవాలన్నారు. ఒకవేళ కోతలు పూర్తయితే పాలాల్లోనే కుప్పలుగా వేయాలని సూచించారు.

'క్వార్క్స్ -2కే23 ఫెస్ట్'లో రాణించిన విద్యార్థులు

విజయనగరం అర్బన్: రాజాం జీసీఎస్ఆర్ కళాశాలలో ఇటీవల జరిగిన 'క్వార్క్స్–2కే23 ఫెస్ట్' పోటీలలో పట్టణానికి మహరాజా అటానమస్ కళాశాల భౌతిక శాస్త్ర విభాగం విద్యార్థులు రాణించారు. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.సాంబశివరావు విద్యార్థులను అభినందించారు. పతకాలు సాధించిన విద్యార్థుల్లో పి.పవిత్ర, ఎస్.నీలవేణి, ఆర్.భాగ్య, కల్యాణి, తదితరులున్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు పి.సత్యనారాయణ, వీజే శాస్త్రి, పీఎస్ ఫణికుమార్ అభినందించారు.

విద్య, వ్యవసాయ రంగాలకు ప్రాధాన్యం



వర్చువల్ విధానంలో మాట్లాడుతున్న జయప్రకాష్‌నారాయణ్

దెంకాడ: దివంగత డాక్టర్ పీవీజీ రాజు విద్య, వ్యవసాయ రంగాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చారని డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ అన్నారు. మాన్సాస్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు డాక్టర్ పీవీజీ రాజు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా 'పీవీజీ రాజు ఫిలాసఫీ, రియలైజేషన్ అండ్ రిలవెన్స్ టు ప్రెజెంట్ టైమ్' అనే అంశంపై వర్చువల్ విధానంలో జయప్రకాష్‌నారాయణ్ శనివారం ప్రసంగించారు. ఈ సందర్భంగా పీవీజీ రాజు చేసిన సామాజిక సేవా కార్యక్రమాలను వివరించారు.

☛ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తున్న 24వ సర్ విజ్జీ ట్రోఫీ క్రికెట్ టోర్నమెంట్‌ను డైరెక్టర్ పి. సీతారామరాజు టాస్ వేసి టోర్నమెంట్ నిర్వహించారు. కార్యక్రమాల్లో వైస్ ప్రిన్సిపాల్ వైఎంసీ శేఖర్, డీన్ ఎస్.మోహన్‌కుమార్, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్. షణ్ముఖరావు, లైబ్రేరియన్ ఉమామహేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

విజయనగరం ఫోర్ట్: రక్తదానం ప్రాణదానంతో సమానమని పీవీజీఆర్ఎస్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస మోహన్ అన్నారు. త్వరలో నిర్వహించనున్న రక్తదాన శిబిరానికి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆరోగ్యవంతులు ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్ అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, రాంబాబు, యశ్వంత్, తదితరులు పాల్గొన్నారు.

వెల్‌నెస్ సెంటర్ తనిఖీ

పూసపాటిరేగ: మండలంలోని కుమిలి గ్రామంలో గల వెల్‌నెస్ కేంద్రాన్ని జిల్లా వ్యాధి నిరోధక టీకా అధికారి డి. అచ్యుతకుమారి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్యశ్రీ బ్రోచర్ల ప్రాముఖ్యతను వివరించారు. సమీపంలో ఇటుక బట్టీలున్న ప్రాంతంలో పిల్లలకు వ్యాధినిరోధక టీకాలు అందుతున్నదీ, లేనిదీ ఆరా తీశారు. ఆమెతో పాటు వైద్యాధికారి భాగ్యరేఖ వున్నారు.

అటవీ భూములు ఆక్రమిస్తే చర్యలు

• డీఎఫ్‌ఓ వెంకటేష్



మాట్లాడుతున్న డీఎఫ్‌ఓ వెంకటేష్

విజయనగరం ఫూల్‌బాగ్: అటవీభూములను ఆక్రమిస్తే చర్యలు తప్పవని డీఎఫ్‌ఓ ఎస్. వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక సారిపల్లి సెంట్రల్ నర్సరీలో అటవీ ఉద్యోగులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సిబ్బంది అటవీ భూముల ఆక్రమణలు, అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సారిపల్లి సెంట్రల్ నర్సరీలో ఏర్పాటు చేసిన విజయనగర వనానికి రూ.80 లక్షలు, బేతనపల్లిలో ఏర్పాటు కానున్న నగర వనానికి రూ.కోటీ 50 లక్షల నిధులు సిద్ధంగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్లు ఆంజనేయులు, త్రినాథరావు, సింధు, డీఆర్‌ఓ ప్రహ్లాదరావు, ఎఫ్ఎస్‌ఓలు కేవీఎన్ రాజు, ఎఫ్‌బీఓలుపాల్గొన్నారు.

మౌలిక వసతులు మెరుగుపర్చాలి

• జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి శాంత



సమావేశంలో మాట్లాడుతన్న జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి శాంత

భోగాపురం: అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపర్చాలని డీఈఓ లింగేశ్వరరెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారి బి. శాంత అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. శనివారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో భోగాపురం ప్రాజెక్ట్ పరిధిలోని భోగాపురం, పూసపాటిరేగ, డెంకాడ సెక్టార్లలలో విధులు నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మన అంగన్‌వాడీ నాడు–నేడు కమిటీ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, భోగాపురం ప్రాజెక్ట్ పరిధిలో ఉన్న 107 అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం మన అంగన్‌వాడీ నాడు–నేడు ద్వారా నిధులు మంజూరు చేసిందన్నారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఏపీఓ గోపిచంద్, సీడీపీఓ ఎస్తేరురాణి, ఏసీడీపీఓ తవిటినాయుడు, మూడు మండలాలకు చెందిన ఏఈలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

• తహసీల్దార్ భాస్కరరావు



ధాన్యం కొనుగోలు కేంద్రాల బ్రోచర్లను విడుదల చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇ.భాస్కరరావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2023 – 24 సంవత్సరానికి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాలపై ప్రజాప్రతినిధులు, కొనుగోలు కేంద్రాల సిబ్బందికి అవగాహన కల్పించారు. ముందుగా ధాన్యం కొనుగోలు కేంద్రాల బ్రోచర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అత్యంత పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. రైతులకు మద్దతు ధర కల్పించాలనే ఉద్దేశంతో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సాధారణ రకం క్వింటాకు 2183 రుపాయలు, గ్రేడ్ ఎ రకం క్వింటాకు 2203 రూపాయలుగా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు, ఎంపీడీఓ ఎం.రాధిక, వైస్ ఎంపీపీ ఎన్. సత్యనారాయణరాజు, ప్రజాప్రతినిధులు టి.సీతారాం, రౌతు శ్రీరామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల నమోదుపై దృష్టి సారించండి



భోగాపురం రెవెన్యూ కార్యాలయంలో సిబ్బందికి సూచనలిస్తున్న ఈఆర్‌ఓ నూకరాజు

భోగాపురం: ఓటర్ల నమోదుపై ప్రత్యేక దృష్టి సారించాలని ఈఆర్‌ఓ నూకరాజు రెవెన్యూ సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నూతన ఓటర్ల నమోదు, చేర్పులు – మార్పులు, తదితర అంశాలపై రెవెన్యూ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం మండలంలోని వివిధ పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఓటర్ల నమోదు, చేర్పులు – మార్పుల ప్రక్రియను పరిశీలించి బీఎల్‌ఓలు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ మూర్తి, తహసీల్దార్ చింత బంగారురాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్. శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం..

• వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు ప్రదీప్‌నాయుడు



కార్యకర్తకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రదీప్‌నాయుడు

నెల్లిమర్ల: బాధిత కుటుంబానికి అండగా ఉంటామని వైఎస్సార్‌సీపీ యువజన నాయకుడు బడ్డుకొండ ప్రదీప్‌నాయుడు అన్నారు. నగర పంచాయతీ పరిధి కొండపేటలో ఇటీవల జరిగిన సామాజిక సాధికార బస్సుయాత్రలో పార్టీ మహిళా కార్యకర్త నడిపేన అచ్చియ్యమ్మ గాయపడింది. ఈ నేపథ్యంలో బాధితురాలిని పార్టీ యువజన నాయకుడు ప్రదీప్ నాయుడు శనివారం పరామర్శించి, రూ. 15 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు మైపాడ ప్రసాద్, పైల భారతి, మొయిద శ్రీనివాసరావు, నాయకులు పైల మురళి, పైల గణేష్, పాలూరి వాసు, కార్యకర్తలు పాల్గొన్నారు.